నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
మంగళవారం | నవంబర్ 26, 2024 | www.navatelangana.com

ప్రేమ పేరుతో మోసగించిన వ్యక్తికి రెండేండ్ల జైలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ప్రేమ పేరుతో యువతిని నమ్మించి శారీరకంగా వాడుకొని పెండ్లికి నిరాకరించిన వ్యక్తికి లక్షెట్టిపేట న్యాయస్థానం రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధించినట్టు ఎస్సై పి.సతీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..ఆంధ్ర బోర్ ప్రాంతానికి చెందిన ఎట్టం అరుణ్ దౌడేపల్లి గ్రామానికి చెందిన మహిళను ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి శారీరకంగా వాడుకున్నాడు. ఆ తర్వాత పెళ్లికి నిరాకరించగా బాధితురాలు 1నవంబర్-2017న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై సమ్మయ్య కేసు దర్యాప్తు చేసి నిందితున్ని కోర్టులో హాజరుపర్చారు. లైజన్ అధికారి గులాం దస్తగిరి సాక్ష్యులను ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అజయ్ ఉల్లం సమక్షంలో జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ విచారణ జరిపి నిందితునికి శిక్ష ఖరారు చేశారు.

పాముకాటు బాధితుడికి పరామర్శ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

పాటుకాటుకు గురైన రాజంపేట గ్రామానికి చెందిన బండు పటేల్‌ను కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయనను సోమవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆసుపత్రిలోని అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న పలువురిని పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని రిమ్స్ వైద్యులకు సూచించారు.



పేదలకు అండ..ఎర్రజెండా..!



పేదలు, కార్మికులు, కర్షకులతో పాటు ఎవరికి కష్టం వచ్చినా..తానున్నానంటుంది ఎర్రజెండా.. పేదల కష్టం తనదిగా భావిస్తుంది. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని భావిస్తుంది. వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకొని ఐక్య ఉద్యమాలకు వారధిగా నిలుస్తోంది సీపీఐ(ఎం)(భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు). ప్రజా ఉద్యమాల్లో తనదైన పంథాను ఎంచుకొని సమస్యల పరిష్కారానికి బాసటగా నిలుస్తోంది. ఈ మూడేండ్ల వ్యవధిలో అనేక ఉద్యమాలు చేపట్టి ప్రజలకు అండగా నిలిచింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక విధానాలను ఎండగడుతూ నిరసనలు చేపట్టి ప్రజల వెంట తామున్నామంటూ చాటిచెప్పింది. తాజాగా ఈ నెల 28, 29తేదీల్లో 13వ మహాసభలు నిర్వహించుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ కార్యక్రమానికి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ హాజరవుతున్నారు. ఈ తరుణంలో పార్టీ చేపట్టిన ప్రజా పోరాటాలపై ప్రత్యేక కథనం..

- మూడేండ్ల వ్యవధిలో అనేక పోరాటాలు
- సమస్యల పరిష్కారంమే లక్ష్యంగా సీపీఐ(ఎం) ఉద్యమాలు
- నిర్బంధాలు.. కేసులను ఎదుర్కొని నిలబడిన వైనం
- కార్మికులు, కర్షకులు, ఆదివాసులకు ఎల్లవేళలా వెన్నుదన్ను
- యంత్రాంగాన్ని కదిలించిన కుండి షేకుగూడ పోరాటం
- ఈ నెల 28, 29తేదీల్లో జిల్లా 13వ మహాసభలు
- హాజరుకానున్న పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పేదలు, మధ్యతరగతి వర్గాలు, కార్మికులు, కర్షకుల సమస్య పరిష్కారమే ఏజెండాగా సీపీఐ(ఎం) ముందుకెళ్తోంది. ఏండ్లుగా ఆయా వర్గాలకు అండగా ఉంటూ వెన్నుదన్నుగా నిలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టడంతో పాటు స్థానిక సమస్యలపై సమరం సాగిస్తూ ప్రజలకు అండగా నిలుస్తోంది. వామపక్ష, ప్రగతిశీల పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకొని ఐక్య ఉద్యమాలు చేపడుతూ రాజీలేని పోరాటం సాగిస్తోంది. ప్రతి మూడేండ్లకు ఒకసారి నిర్వహించే జిల్లా మహాసభల్లో చేసిన తీర్మాణాలకు అనుగుణంగా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తోంది. వాటికి అనుగుణంగా పోరాటాలు చేపడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడుతోంది. తాజాగా ఈ నెల 28, 29తేదీల్లో 13వ జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహించుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ తరుణంలో ఈ మూడేండ్ల కాలంలో అనేక ఉద్యమాలు చేపట్టి ప్రజలకు అండగా నిలుస్తున్న ఎర్రజెండా పార్టీ.. మరో మూడేండ్ల పాటు చేపట్టబోయే ఉద్యమ కార్యాచరణ రూపొందించుకునేందుకు సిద్ధమవుతోంది.

సమస్యల పరిష్కారానికి రణం..!

ఈ మూడేండ్ల వ్యవధిలో పార్టీ అనేక ప్రజా ఉద్యమాలకు ఆజ్యం పోసింది. చరిత్రలో నిలిచే పోరాటాలకు వేదికగా నిలిచింది. అనేక విజయాలను సొంతం చేసుకుంది. అనేక నిర్బందాలు, పోలీసు కేసులను ఎదుర్కొని సాగించిన ఈ ఉద్యమాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి దిక్సూచిగా నిలిచిందనడంలో సందేహం లేదు. ముఖ్యంగా సిమెంటు పరిశ్రమ పునరుద్ధరణ కోసం అలుపెరగని రణం సాగించింది. 2022 జనవరి 1న పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ, ఎంఐఎం మినహా అన్ని పార్టీలు ప్రజా సంఘాలను కలుపుకొని సీసీఐ సాధన కమిటీ ఏర్పాటుచేసింది. 34 రోజుల పాటు రిలే నిరహార దీక్షలు చేపట్టడంతో పాటు జాతీయ రహదారి దిగ్బందనం చేపట్టింది. ఒక రోజు పట్టణ బంద్ నిర్వహించి ప్రజలకు ఈ పరిశ్రమ అత్యవసరాన్ని తెలియజెప్పింది. పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జన చైతన్య యాత్రను ఆదిలాబాద్‌లోనే ప్రారంభించింది. 1300మంది హాజరైన ఈ బహిరంగ సభకు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీ.వీ.రాఘవులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మూడు సార్లు నిర్వహించిన ప్లీనం సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోడు భూములకు హక్కుపత్రాలు అందించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఉట్నూర్‌లో భారీ రాస్తారోకో చేపట్టారు. జీఓ 3ని సుప్రీంకోర్టు రద్దు చేయడంతో పునరుద్ధరించాలని పలుసార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన సందర్భాలున్నాయి. ఉట్నూర్ మండలంలోని చెప్రయాల్, ఘన్‌పూర్ గ్రామాల సమస్యలు పరిష్కరించాలని పార్టీ జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో 9కి.మిలు నడిచి అధ్యయనం చేసింది. 15కి.మి మేర పాదయాత్ర చేపట్టి ఐటీడీఏ ముట్టడి నిర్వహించడంతో యంత్రాంగం స్పందించి ఆ గ్రామాలకు తాగునీరు, విద్యుత్తు, ఉపాధిహామీ కార్డులు వెంటనే మంజూరుచేశారు. కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని పార్టీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు పోరుయాత్ర చేపట్టారు. ముగింపు కార్యక్రమానికి జూలకంటి రంగారెడ్డి హాజరయ్యారు. అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని 2023 సెప్టెంబర్‌లో కలెక్టరేట్ ఎదుట పోరాటాన్ని చేపట్టింది. ఈ పోరాటంలో 13మందిపై కేసులు నమోదయ్యాయి.

కదిలించిన కుండిషేకుగూడ పోరాటం..!

జిల్లాలోని మారుమూల మండలం గాదిగూడ. ఈ మండలంలోని కుండిషేకుగూడ వాసులు అనేక ఏండ్ల పాటు కనీస సౌకర్యాలకు కూడా నోచుకోలేదు. ఆ గ్రామాన్ని సందర్శించిన నాయకులు గుక్కెడు నీటి కోసం ఆ పల్లెవాసులు పడుతున్న బాధలను కళ్లారా చూసింది. వీటి పరిష్కారమే ధ్యేయంగా 2022 ఫిబ్రవరి 3న ఆ గ్రామం నుంచి జిల్లా కేంద్రం వరకు 75 కిలోమీటర్ల పాదయాత్రను చేపట్టింది. ఆ ఊరంతా పిల్లాపాపలతో నాయకత్వం వెంట నడిచి వచ్చింది. కలెక్టరేట్ ఎదుట తొమ్మిది రోజుల పాటు టెంటు వేసి దీక్షలు చేపట్టారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఇక్కడ్నుంచి వెళ్లేదిలేదని గ్రామస్తులు పట్టుబట్టారు. పార్టీ నాయకత్వం వారికి అన్ని విధాలా అండగా నిలవడంతో అధికార యంత్రాంగం దిగొచ్చింది. గ్రామంలో రెండు బోర్లు వేసి త్రీఫేజ్ కరెంటు సౌకర్యం కల్పించడంతో పాటు గ్రామంలోని వాటర్ ట్యాంకుకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. రోడ్డు నిర్మాణానికి కూడా హామీనిచ్చారు. దీంతో అనేక ఏండ్ల నుంచి తాగునీటికి కూడా నోచుకోని ఆ గ్రామానికి పార్టీ ఉద్యమ ఫలితంగా తాగునీరు రావడంతో ఆ గ్రామస్తుల్లో ఆనందం వెల్లువిరిసింది. ఇలా అనేక ప్రజా పోరాటాల్లో భాగస్వామ్యమై అన్ని విధాలా అండగా నిలిచిన ఎర్రజెండా పార్టీ భవిష్యత్తులోనూ ఇదే విధమైన పంథాను కొనసాగించేందుకు సిద్ధమవుతోంది.





సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం :

దర్శనాల మల్లేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ మూడేండ్లలో రాజీలేని పోరాటాలు చేపట్టాం. అనేక నిర్బంధాలు, కేసులను ఎదుర్కొని నిలబడ్డాం. కొన్ని విజయాలు సాధించాం. లౌకిక భారత రాజ్యాంగం కోసం పార్టీ కట్టుబడి ఉంది. భవిష్యత్తులోనూ జిల్లాలో సీసీఐ, ఆదిలాబాద్, ఆర్మూర్ రైల్వేలైను, పారిశ్రామిక అభివృద్ధి కోసం పోరాటాలు సాగిస్తాం. కార్మికులు, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం రానున్న మహాసభల్లో తీర్మాణాలు చేస్తాం. ప్రజాతంత్ర శక్తులు, ప్రజాసంఘాలను కలుపుకొని ఐక్య ఉద్యమాలు చేపడుతాం.







ఉయిక సంజీవ్ కుటుంబ సభ్యులకు పరామర్శ

ఆదిలాబాద్‌రూరల్ : అనారోగ్యంతో మృతి చెందిన ఆదివాసీ ఉద్యమ నాయకుడు, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్ కుటుంబాన్ని ఆదివారం రాత్రి ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. బేల మండలం సాంగ్వి(జి)లోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంజీవ్ మృతి ఆదివాసులకు తీరని లోటని తెలిపారు. ఆదివాసుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఉద్యమాలు చేశారని, అలాంటి వ్యక్తి మృతి బాధాకరమని పేర్కొన్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు నవీన్‌రెడ్డి, విశాల్ ఉన్నారు.

అటవీ హక్కులపై అవగాహనా సదస్సు

కాసిపేట : మండలంలోని కొత్త తిరుమలాపూర్, పాత తిరుమలాపూర్, భగవంత్‌పూర్ గ్రామాలలో సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ(సీపీఎఫ్), భారత్ రూరల్ లైవ్లీ వుడ్ ఫౌండేషన్(బీఆర్‌ఎల్‌ఎఫ్) ఆధ్వర్యంలో కమ్యూనిటీ ఫారెస్ట్ రైట్స్‌పై అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన సదస్సు ఏర్పాటు చేసి అటవీ హక్కులు, చట్టాలపై ఆదివాసులకు అవగాహన కల్పించారు. అనంతరం పలు కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కుమురం భీం యువజన సంఘం అధ్యక్షుడు పెంద్రం హన్మంతు, గ్రామ పటేళ్ల టేకం శ్రీనివాస్, కుమురం భగవంతరావు, టేకం భీము, సీపీఎఫ్ సిబ్బంది కవిత, సంతోష్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నిర్మల్‌రూరల్: మండలంలోని ముఠాపూర్ గ్రామ శివారులోని కడ్తాల్ వాగులో సైపాన్ దగ్గర గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు నిర్మల్ రూరల్ ఎస్ఐ లింబాద్రి తెలిపారు.



మృతుడు లుంగీ, షర్ట్ ధరించి ఉన్నాడు. వయస్సు 40-50 సంవత్సరాలు ఉండి మృతదేహం కుళ్లిపోయి ఉందని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, ఎవరైన కనపడకుండా పోయినట్లయితే సంప్రదించాలని పేర్కొన్నారు.

మాలల సింహగర్జన పోస్టర్లు విడుదల

నవతెలంగాణ- కాసిపేట

మండల కేంద్రంలో సోమవారం మాలల సింహగర్జన పోస్టర్లను ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. డిసెంబర్ 1న మధ్యాహ్నం 12గంటలకు హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాలల సింహగర్జనకు మాలలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మేడ సమ్మయ్య, జేఏసీ కన్వీనర్ సుధాకర్, కో కన్వీనర్లు జూపాక సుధీర్, గజెల్లి లక్ష్మణ్, కుంబాల రాజేశ్, మధుకర్, బన్న లక్ష్మణ్‌దాస్, భూపెల్లి మల్లేశ్, మేడ రాంచందర్, చంద్రయ్య పాల్గొన్నారు.

పెన్షన్ పునరుద్ధరించండి సార్

ఆదిలాబాద్‌టౌన్: తన చిన్నతనంలోనే తల్లిదండ్రులిద్దరూ చనిపోయారని, తనకు వచ్చే పెన్షన్ ఆగిపోయిందని ఓ బాలుడు వాపోయాడు. ఈ విషయమై సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశాడు. పట్టణంలోని పర్కోట కాలనీకి చెందిన అశుతోష్ వర్మ మహారాష్ట్రలో ఉండే మేనమామ ఇంటికి వెళ్లి వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్నాడు. తనకు నెలకు రూ.4వేలు వచ్చే పెన్షన్ 5నెలలుగా రావడం లేదన్నారు. అధికారులు తన పెన్షన్‌ను పునరుద్ధరించి న్యాయం చేయాలని కోరారు.

మామిడిగూడెంలో కార్డెన్ అండ్ సెర్చ్

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని మామిడిగూడెం గ్రామంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. కాసిపే, మందమర్రి, దేవాపూర్, రామకృష్ణాపూర్ ఎస్ఐలు, సిబ్బంది, నార్కోటిక్ డాగ్ మొత్తం 30 మంది పోలీసుతో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా తనిఖీ చేపట్టారు. ఎవరైన అనుమానాస్పద వ్యక్తులు ఈ ప్రాంతంలో ఉంటున్నారా? అపరిచిత వ్యక్తులకు ఇక్కడ ఎవరైన షెల్టర్ ఇస్తున్నారా? అనే కోణంలో విచారించారు. ప్రతి ఒక్కరి ఆధార్, గుర్తింపు కార్డ్ పరిశీలించారు. దీంతో పాటు ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్సులు పరిశీలించారు. సరైన పత్రాలు లేని, నెంబర్ ప్లేట్‌లేని 39 ద్విచక్ర వాహనాలు గుర్తించి జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ గుడుంబా తయారీ, అమ్మడం చేయవద్దని సూచించారు. సైబర్ క్రైమ్, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ రూల్స్, కొత్త చట్టాలు, మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. నార్కోటిక్ డాగ్ సిబ్బందితో అనుమానం ఉన్న గంజాయి అమ్మే, తాగే ఇళ్లను, గుడుంబా తయారు చేసే ఇళ్లను తనిఖీ చేశారు. ఇటీవల కాలంలో మామిడిగూడెంలో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిసి పారిశుద్యంపై అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్ తప్పకుండా పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, మందమర్రి, రామకృష్ణాపూర్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సంక్షేమ హాస్టళ్లలో చలి రక్షణ చర్యలు చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-నిర్మల్ రూరల్

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహల్లోని విద్యార్థులకు చలి నుండి రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దిగంబర్ అన్నారు. దిలావర్‌పూర్ బీసీ హాస్టల్‌ను సందర్శించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రగ్గులను ఇంకా పంపిణీ చేయకపోవడంతో విద్యార్థులు చలి బారినపడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వాలు, అధికారులు మారినా సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మాత్రం తిప్పలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన వసతులు లేని అద్దె భవనాల్లో హాస్టల్ నిర్వహణ కొనసాగుతోందని తెలిపారు. సరైన కిటికీలు, తలుపులు లేకపోవడంతో చలితో విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. 2019లో రాష్ట్ర ప్రభుత్వం నాణ్యత గల రగ్గులను పంపిణీ చేసిందని, అప్పటి నుండి ఇప్పటి వరకు నాసిరకమైన రగ్గులను పంపిణీ చేస్తోందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులు చలి నుండి రక్షణ పొందేందుకు క్వాలిటీ రగ్గులతో పాటు స్వెటర్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కిటికీలు, డోర్లు లేని పాత బిల్డింగ్‌లకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు.



చిట్యాల పాఠశాలను సందర్శించిన యూపీఎస్సీ ట్రైనీ అభ్యర్థులు



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

యూపీఎస్సీ ద్వారా వివిధ జాతీయ స్థాయి ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు సోమవారం చిట్యాల పాఠశాలను సందర్శించారు. ఐడీఈడీ ఆయుష్ మౌర్య, ఐఎస్ఎస్ గౌరవ కుమార్, ఐఎఫ్ఎస్ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఐఈఎస్ నిశ్చల్ మిట్టల్, ఐపీఎస్ ప్రశాంత్ కిరణ్ ట్రైనింగ్‌లో భాగంగా చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులు, అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం పెట్టుకొని కృషి చేస్తే ఉన్నత స్థాయి లభిస్తుందని, ఎన్ని కష్టాలు ఉన్నా చిత్తశుద్ధితో చదివి అనుకున్న స్థాయిని సాధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారిణి బి.రాణి, పంచాయతీ కార్యదర్శి అశోక్ కమ్రే, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గజపల్లి నర్సయ్య, ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, కుమార్, సంతోష్, అనూష పాల్గొన్నారు.

సైన్స్ ఫెస్టివల్‌కు ఉపాధ్యాయుడు ప్రవీణ్



కాసిపేట : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు జాడి ప్రవీణ్ ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్-2024కు ఎంపికయ్యారు. ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ (ఐఐఎస్ఎఫ్), విజ్ఞాన భారతితో కలిసి భారత ప్రభుత్వంలోని సైన్స్ అండ్ టెక్నాలజీ, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ వారు నిర్వహిస్తారు. ఇది నవంబర్ 30 నుండి డిసెంబర్ 3 వరకు నాలుగు రోజులపాటు అస్సాంలోని ఐఐటీ గౌహతిలో జరగనుంది. ఈశాన్యం తొలిసారిగా అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌ను నిర్వహించనుంది. ఐఐఎస్ఎఫ్ 2024, 10వ ఎడిషన్ సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ ద్వారా దేశ నిర్మాణానికి సైన్స్ విద్యను ఒక సాధనంగా ఉపయోగించడం ఈ కార్యక్రమం లక్ష్యం. ఈ కార్యక్రమంలో భాగంగా ఎడ్యుకేషన్ ఫర్ అస్పైరింగ్ ఇండియా నేషనల్ సైన్స్ టీచర్స్ వర్క్ షాప్ ఈవెంట్‌కు ఉపాధ్యాయుడు జాడి ప్రవీణ్ ఎంపికయ్యారు. ఈ ఫెస్టివల్ విద్యార్థులకు అగ్రశ్రేణి శాస్త్రవేత్తలతో కనెక్ట్ అవ్వడానికి, సైన్స్ పోటీలలో పాల్గొనడానికి, అద్భుతమైన ఆవిష్కరణలను అనుభవించడానికి అవకాశం కల్పిస్తుందని ఉపాధ్యాయుడు జాడి ప్రవీణ్ అన్నారు. ఇలాంటి కార్యక్రమానికి అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఐఐఎస్ఎఫ్‌కు ఎంపిక కావడం పట్ల తోటి ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, డీఈవో యాదయ్య శుభాకాంక్షలు తెలిపారు.

సఖీ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన



ఆదిలాబాద్‌టౌన్: సఖీ కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యానగర్ శ్రీ శిరిడి సాయి సేవా సొసైటీ వారి సౌజన్యంతో నడుస్తున్న వత్తివిద్య నైపుణ్య శిక్షణ కేంద్ర యువతకు, అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సఖి కేంద్రం సభ్యులు మాట్లాడుతూ ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు ఏదో ఒక హింసకు గురవుతున్నారని, మహిళలపై హింసను నిర్మూలించడం కోసం ప్రతి ఒక్కరు ప్రయత్నించాలని తెలిపారు. ఆర్థికపరంగా సాధికారతతో ముందుకు వెళ్లాలన్నారు. అలాగే సఖి అందించే ఐదు రకాల సేవలు కౌన్సెలింగ్, న్యాయ, వైద్య, పోలీసు, తాత్కాలిక వసతి గురించి వివరించారు. బాలికలు, మహిళల చట్టాలు, ఆపద సమయాలలో సంప్రదించాల్సిన హెల్ప్ లైన్ నంబర్స్ 181,1098, 1930, 100, 14567 గురించి వివరించారు. సఖి కేంద్రానికి వచ్చే బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సఖి కేంద్రం సైకో సోషల్ కౌన్సిలర్ లావణ్య, లీగల్ కౌన్సిలర్ సంఘమిత్ర, కేస్ వర్కర్ ప్రవీణ, మల్టీపర్పస్ సునీత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సంగీత, టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్ ట్రైనర్ అన్వారి పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చింపిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్ : రిమ్స్ ఆస్పత్రిలోని నారాయణ బాబా ఫ్లెక్సీని ఓ ఫౌండేషన్ సభ్యులు చించివేయడం తమ మనోభావాలను దెబ్బతీస్తున్నాయని, వారిపై చర్యలు తీసుకోవాలని నారాయణ బాబా భక్త మండలి సభ్యులు కోరారు. సోమవారం ఈ విషయమై ఎమ్మెల్యే పాయల శంకర్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా భక్త మండలి సభ్యులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు తాము వ్యతిరేకం కాదని, కానీ ఇతరుల మానోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించవద్దని కోరారు. ఏడు సంవత్సరాలుగా రిమ్స్‌లో రోగి సహాయకులకు అన్నదానం చేస్తున్నామని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | నవంబర్ 26, 2024 | www.navatelangana.com

అర్హులైన వారికి సీఎంఆర్ఎఫ్ అందించేందుకు కృషి

నవతెలంగాణ-బోథ్



అర్హులైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించేందుకు కృషి చేస్తానని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయం మర్లపెల్లి గ్రామానికి చెందిన సంజీవ్‌కు రూ.42వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీలు కుర్మే మహేందర్, నాయకులు షేక్, ఉమేష్, రాజు యాదవ్, మహమ్మద్, రాజు, అబుద్, అబ్రర్, అజీమ్, గాజుల పోతన్న, గడ్డల నారాయణ, సాయన్న పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



యువశక్తి ఫౌండేషన్‌పై పలువురు సోషల్ మీడియాలో రెచ్చగొడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఫౌండేషన్ అధ్యక్షుడు రోహిత్ షిండే అన్నారు. సోమవారం ప్రజావాణిలో ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయను కలిసి వినతిపత్రం అందజేశారు. రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో స్వచ్ఛందంగా అన్నదానం చేస్తున్న తమ ఫౌండేషన్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. దీనికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సోమ ప్రశాంత్, రవితేజ పాల్గొన్నారు.

నాణ్యతతో పాటు మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



నవతెలంగాణ-తాంసి

నాణ్యతతో పాటు మెనూ ప్రకారంగా విద్యార్థులకు భోజనం పెట్టాలని అసిస్టెంట్ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ సిబ్బందికి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న విద్యా, భోజన సరుకులను పాఠశాలలోని కంప్యూటర్‌లను పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడారు. డైనింగ్ హాల్‌ను పరిశుభ్రంగా ఉంచి విద్యార్థులు భోజనం చేసే విధంగా అందుబాటులోకి తీసుకురావాలని వార్డెన్‌కు సూచించారు. విద్యార్థులకు అవసరమైన తాగునీటి ఆర్‌ఓ ప్లాంట్ చలికాలంలో వేడినీళ్ల పరికరాన్ని ఏర్పాటు చేసే విధంగా చూడాలని అన్నారు. మరుగుదొడ్ల నిర్మాణంలో గుత్తేదారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని కలెక్టర్ దృష్టికి సిబ్బంది తీసుకొచ్చారు. ఆయన వెంట వార్డెన్ హరీష్, హాస్టల్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచాలి



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని సోయా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచాలని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అన్నారు. సోమవారం మార్కెట్ యార్డులో సోయా కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పంటలు అమ్ముకోవడానికి గన్ని బ్యాగుల సమస్య ఉందని చెప్పడంతో వెంటనే మార్క్‌ఫెడ్ డీఎం ఫోన్ ద్వారా ప్రతి మార్కెట్ యార్డులో గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచాలని కోరారు. రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా సోయా కొనుగోలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లులు రాజు యాదవ్, ఉమేష్, మాజీ ఎంపీటీసీలు మహేందర్, నాయకులు అజీమ్, మహమ్మద్, అబ్రార్, అబుద్, గడ్డల నారాయణ, గాజుల పోతన్న, భోజన్న, సాయన్న, అసిఫ్, వంశీ పాల్గొన్నారు.

మడావి తుకారాం వర్ధంతి సభను జయప్రదం చేయాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

ఈనెల 29న మండలంలోని లక్కెటిపేట గ్రామంలో తొలి ఆదివాసీ ఐఏఎస్ మడావి తుకారాం 26వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ వర్ధంతి సభకు రావాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంత ఆదివాసీ ప్రజల కోసం మడావి తుకారాం ఎనలేని సేవలందించారని అన్నారు. ఉట్నూర్ మండలంలోని లక్కెటిపేట గ్రామంలో ఓ సామాన్య కుటుంబంలో జన్మించిన ఆయన ఎన్నో పదవులను చేపట్టి సమాజ హితం కోసం పని చేశారని, వారు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. మడావి తుకారాం స్మారకార్థం వాలీబాల్ పోటీలను సైతం నిర్వహించడం జరుగుతుందని, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మడావి తుకారాం వర్ధంతి సభ నిర్వహణ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలపై కళాజాత ప్రదర్శన



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని నాగపూర్, లింగోజి తండా గ్రామంలో సోమవారం ప్రజాపాలన విజయోత్సవాలపై డీపీఆర్వో ఆదేశాలతో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, 6 గ్యారంటీలు, సమగ్ర కుటుంబ సర్వే తదితర అంశాలపై కళాకారులు గిరిజన భాషలో ఆటపాటలతో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు గోవింద్, శంకర్, ఆశీస్, నగేష్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

- హామీలు అమలు చేయాలని నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వైద్యారోగ్యశాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని వైద్యారోగ్య సంఘాల పోరాట కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ అన్నారు. సోమవారం ఏఎన్ఎంలకు రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య సంఘాల పోరాట కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా వైద్యారోగ్య శాఖలో సెకండ్ ఏఎన్ఎం, ఈసీపీ, అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. గతంలో 45 రోజుల పాటు సమ్మె చేస్తే సంవత్సరం క్రితం రెగ్యులర్ చేయడంలో భాగంగా కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ఆ కమిటీ నివేదికను కూడా బహిర్గతం చేయలేదన్నారు. కానీ ఇప్పుడు రెగ్యులర్ కోసం ఏఎన్ఎంలకు రాత పరీక్షలు నిర్వహించాలని యోచిస్తున్నారన్నారు. వెంటనే ఆ నిర్ణయాన్ని మానుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పుష్పల, ఆనందాబాయి, తులసి, సంగీత, జ్యోతి, విజయలక్ష్మి, మమతా, రమాదేవి, అశ్విని, ప్రభ పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన సీఎం రేవంత్‌రెడ్డి

- 29న దీక్షా దివాస్‌పై దిశానిర్దేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అధికారంలోకి రాకముందు అనేక హామీలు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారని, ప్రతిపక్ష హోదాలో ఉన్న తాము వాటి సాధన కోసం ఉద్యమిస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఈనెల 29న బీఆర్ఎస్ దీక్షా దివాస్ విజయవంతానికి సోమవారం పార్టీ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. దీనికి జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ వి.గంగాధర్‌గౌడ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులను జిల్లా అధ్యక్షుడు శాలువాతో సత్కరించారు. అనంతరం ఈనెల 29న చేపట్టే దీక్షా దివాస్ విజయవంతంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ కార్యకర్తలు సైనికుల్లా పని చేస్తే ఆ పార్టీకి ఎదురు ఉండదన్నారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ పథకాల కంటే అద్భుతమైన పథకాలను అమలు చేస్తామన్న సీఎం ఆరు గ్యారంటీలు కూడా సక్రమంగా అమలు చేయడం లేదని ఎద్దేవ చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ ఎమ్మెల్యే ఫసల్ భీమా కోసం ఉద్యమించారన్నారు. కానీ ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. దీన్ని బట్టిచూస్తే బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని అర్థమవుతుందన్నారు. ఈనెల 29న జిల్లా కేంద్రంలో నిర్వహించే దీక్షా దివాస్‌లో పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అజయ్, నాయకులు సాజిదోద్దిన్, రౌతు మనోహర్, రోకండ్ల రమేష్, మెట్టు ప్రహ్లాద్, ఇజ్జగిరి నారాయణ, సలీమ్, సంధ్యారాణి, స్వరూప రాణి, మమత, పర్వీన్, కౌన్సిలర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఓ నెం.17ను రద్దు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



దివ్యాంగులకు ఆసరా పెన్షన్‌కు ఆధాయ పరిమితి విధిస్తు తీసుకువచ్చిన జీఓ నెం.17ను రద్దు చేయాలని ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు ఎం.నగేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు ఎం.నగేష్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగులకు పింఛన్ రూ.6 వేలను ఇస్తామని సీఎం రేవంత్ ప్రకటించారని, ఏడాది పూర్తి అవుతున్న ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని అన్నారు. ఇచ్చిన హామీల అమలుతో పాటు జీఓ నెం.17ను రద్దు చేయాలన్నారు. 2014 నుంచి 2023 వరకు వికలాంగులకు కేటాయించిన బడ్జెట్‌ను సక్రమంగా అమలు చేయాలన్నారు. రాయితీ బస్సు పాస్‌లతో పాటు బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్పీఆర్డీ సంఘం ప్రధాన కార్యదర్శి ఆరిఫా, అనసూయ, పొచ్చన్న, మారుబాయి, పూజ, ఆత్మరాం పాల్గొన్నారు.

ప్రజల స్థితిగతులు మారడం లేదు

- కలెక్టరేట్ ఎదుట ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వాలు మారుతున్న సామాన్య ప్రజల స్థితిగతులు మాత్రం మారడం లేదని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహారాజ్ అన్నారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సామాన్య ప్రజలకు ప్రభుత్వాలు అండగా ఉంటూ విద్య, వైద్యం అందించాలని నినాదాలు చేస్తూ బైఠాయించారు. ఈ సందర్భంగా డీఎస్పీ అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అగ్రకులాల పాలనలో అట్టడుగు వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జీవితాలు మారడం లేదన్నారు. వారికి విద్య, వైద్యం, ఉపాధి, ఇల్లు కల్పించడంలో విఫమయ్యాయని ఆరోపించారు. ప్రజలకు ఏమి చేయని ప్రభుత్వాలు ఉన్న ఒక్కటే లేకున్న ఒకటేనని అన్నారు. జీవించే హక్కు కల్పించిన రాజ్యాంగం కూడా సామాన్యులకు వసతులు కల్పించాలని చెబుతోందన్నారు. అందుకే పేదల పక్షాన ధర్మసమాజ్ పార్టీ అండగా ఉంటూ ఉద్యమిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చీటి వెంకటేష్, బోథ్ మండలాధ్యక్షులు కె .గణేష్, అధ్యక్షులు రాజేశ్వర్, బజార్‌హత్నూర్ అధ్యక్షులు నరేష్, ఆదిలాబాద్ అర్బన్ అధ్యక్షులు సంతోష్, ఉట్నూర్ అరవింద్, ఆయా మండలాల నాయకులు నవీన్, రమేష్, తరుణ్, సంతోష్, లక్ష్మణ్, సుధాకర్, రాథోడ్ నరేందర్, వినోద్, సాయి, స్వామి, గంగన్న, ప్రేమ్, ప్రమోద్, ఒమన్న రవి, గంగాధర్, జగదీష్, హరిప్రసాద్, పాల్గొన్నారు.

చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలి

- వ్యాధి నిరోధక టీకాలపై శిక్షణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుందని వారికి క్రమం తప్పకుండ టీకాలను వేయాలని, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. సోమవారం డీఎంహెచ్ఓ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యాధి నిరోధక టీకాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి హైదరాబాద్ నుంచి వచ్చిన ట్రైనర్లు ఏ విధంగా టీకాలు వేయాలో మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ మాట్లాడుతూ జిల్లాలోని చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుందన్నారు. దాన్ని అధిగమించేలా వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా వేసేలా అవగాహన కల్పించాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు వారిని పర్యవేక్షిస్తు సూచనలు చేయాలని ఆదేశించారు. చలికాలంలో శ్వాసకోశ వ్యాధులు అధికంగా వస్తాయని, వాటిపై ప్రజలను అప్రమత్తం చేస్తు జాగ్రత్తలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర అబ్జర్వర్స్ డేవిడ్, అతుల్, మురళి, జోత్స్న, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వైసీ శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



టీజీఓ నూతన కార్యవర్గానికి సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన కాండ్లీ శివకుమార్, కార్యదర్శి డాక్టర్ రామారావు రాథోడ్‌లను టీఎన్జీఓస్ జిల్లా కమిటీ పక్షాన సన్మానించారు. సోమవారం టీఎన్జీఓస్‌లో వారిని శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ జిల్లాలో గజిటెడ్ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ అధ్యక్షుడు ఎస్.అశోక్, కార్యదర్శి ఎ.నవీన్ కుమార్, అసోసియేట్ అధ్యక్షులు గుజరాత్ గోపి, రాజేశ్వర్, రాంమోహన్, శ్రీనివాస్, రూరల్ తాలూకా అధ్యక్షులు అసూరి ప్రవీణ్, కార్యదర్శి అరుణ్, వెంకటేష్, కలీం, వార్డెన్ సంఘం బాధ్యులు దత్తు, మున్సిపల్ ఉద్యోగుల బాధ్యులు వెంకటేష్, నర్సింలు, సంజయ్, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలి

- సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్



నవతెలంగాణ-నార్నూర్

ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకులం పాఠశాలతో పాటు మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాల, జామడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ముందుగా సరుకుల స్టాక్ రూంను పరిశీలించారు. భోజన వివరాలను విద్యార్థులకు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యపై ఎప్పటికప్పుడు ఆరాతీయాలని, భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. వారి వెంట ప్రధానోపాధ్యాయులు చౌహాన్ వందన, జాదవ్ వసంత్ రావ్, పీడీ ఆడే విశ్వనాథ్, వార్డెన్ పవార్ వనిత, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

కేజీబీవీ సందర్శించిన ఎంఈఓ



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని జామ్ గ్రామంలోని కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్ పాఠశాలను సోమవారం ఏంఈఓ మధుసూధన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది భోజనశాల సరుకుల నిల్వలతో పాటు స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. అనంతరం తాజా కూరగాయలు నాణ్యమైన సరుకులతో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని అన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాధిక, కేజీబీవీ ఎస్ఓ అన్నపూర్ణలకు ఆదేశించారు.

విద్యుత్ మోటార్లు మంజూరు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా తమకు బోర్లు మంజూరు అయ్యాయని, కానీ మోటార్లు మంజూరు కాలేదని వెంటనే విద్యుత్ మోటార్లు మంజూరు చేసి తమను ఆదుకోవాలని ఇచ్చోడ మండలం తలమద్రి దళిత రైతులు కోరారు. సోమవారం ప్రజావాణికి వచ్చి అధికారులకు తమ సమస్యను విన్నవించారు. గత మూడు సంవత్సరాల క్రితం కార్పొరేషన్ ద్వారా తమకు బోర్లు మంజూరు అయ్యాయన్నారు. అలాగే విద్యుత్ శాఖ నుంచి తమకు కరెంట్ కూడా మంజూరు అయిందని తెలిపారు. కానీ మోటార్లు మంజూరు చేయలేదన్నారు. దింతో పంట పండించుకోవడానికి ఇబ్బంది ఉందని రైతులు వాపోయారు. వెంటనే కార్పొరేషన్ ద్వారా తమకు విద్యుత్ మోటార్లు మంజూరు చేయాలని, తద్వారా రబీ పంట వేసుకుంటామన్నారు.

బీసీ స్టడీ సర్కిల్ నుంచి 12 మందికి ఉద్యోగాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల విడుదలైన గ్రూప్-4 ఫలితాల్లో ఆదిలాబాద్ బీసీ స్టడీ సర్కిల్ నుంచి 12 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినట్టు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాగేంద్ర, నీలవేణి, కార్తీక్, యోగేందర్ సింగ్, ఉదయ్, శ్రావణి, అమీర్, సాయి తరుణ్, కృష్ణంరాజు, విజయ్, ధనంజయ్, ప్రశాంత్ ఉద్యోగాలు పొందినట్లు పేర్కొన్నారు. వీరికి స్టడీ సర్కిల్ తరపున అభినందనలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి కేంద్రీయ స్థాయి పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న అభ్యర్థుల కోసం స్టడీ సర్కిల్‌లో స్టడీ హాల్ లైబ్రరీ సౌకర్యం ఉన్నట్లు పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అన్ని రకాలైన పోటీ పరీక్షల పుస్తకాలు, న్యూస్ పేపర్లు మ్యాగ్జిన్లు లభిస్తాయన్నారు. నిరుద్యోగులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్

నవతెలంగాణ-కౌటాల



సంతూర్ ఉమెన్స్ స్కాలర్షిప్‌కు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ సంఘ కిరణ్ కుమార్ అభినందించారు. మండలంలోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో చదువుతున్న మొదటి సంవత్సరం విద్యార్థి నీలుతో పాటు 18 మంది సంతూర్ ఉమెన్స్ స్కాలర్షిప్‌కు ఎంపిక కావడం జరిగినది వీరికి ఎంపికైన విద్యార్థులకు ఎంపిక పత్రాలను కళాశాల ప్రిన్సిపాల్ అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులకు ఇలాంటి స్కాలర్షిప్ ఉన్నత చదువులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా విప్రో సంతూర్ కంపెనీకి కరస్పాండెంట్ చిలువేరు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సంఘ కిరణ్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉద్యమ నాయకుడికి నివాళులు

నవతెలంగాణ-బెజ్జూరు



తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజీవ్ అకాల మరణం ఆదివాసీ సంఘానికి తీరని లోటని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం బక్కయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఆయన మృతి పట్ల ఆదివాసులు సంతాపం ప్రకటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ప్రజలకు 30 సంవత్సరాలుగా విశేష సేవలు అందించి, ఆదివాసీ హక్కుల పోరాటం కోసం అనేక ఉద్యమాలు నడిపి సమస్యల కోసం పోరాటం చేసిన గొప్ప వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం గౌరవ అధ్యక్షులు సాకారాం, మండల అధ్యక్షులు తిరుపతి, మండల సార్‌మేడి శంకర్, నాయకులు మల్లేష్, సతీష్, పోల్క వెంకటేష్, శంకర్, ప్రశాంత్ ఉన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ట్రాక్టర్ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని బైపాస్ రహదారిపై చోటుచేసుకుంది. సీఐ బుద్ధ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రాజంపేటకు చెందిన షేక్ సలీం కుమారుడు షేక్ రిహాన్(17) ఉదయం బైక్‌లో పెట్రోల్ నింపడానికి బైపాస్ రహదారి నుండి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాంగ్ రూట్‌లో వస్తున్న ట్రాక్టర్ వేగంగా బైక్‌ను ఢీకొనడంతో రిహాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ట్రాక్టర్ మరో ఆటోను కూడా ఢీ కొట్టిన అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. డ్రైవర్ వసాకే లోకాజీని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రవీందర్ తెలిపారు. మృతుని తండ్రి జిల్లా కేంద్రంలో రిపోర్టర్ ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు.

పశు వైద్యులెక్కడ..?

- అంతు చిక్కని వ్యాధితో మేకల మృతి

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలంలోని బాలాజీ అనుకోడా గ్రామానికి చెందిన గుస్సా భీమయ్యకు చెందిన మూడు మేకలు సోమవారం అంతుచిక్కని వ్యాధితో మృతి చెందాయి. అరగంట వ్యవధిలో మూడు మేకలు మృతి చెందినట్టు బాధితులు తెలిపారు. పిట్టలు రాలినట్టు మేకలు మృతి చెందుతుంటే పశు వైద్యులు మాత్రం పట్టించుకోవడంలేదని, పశువులు మృతి చెందుతున్న కూడా పట్టించుకోని నాధుడేలేరని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించాలని, పశు వైద్యులను నియమించాలని కోరుతున్నారు.

ఎండీఎం వర్కర్లకు వంట పోటీలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులకు జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలలో జిల్లాస్థాయి వంట పోటీలు నిర్వహించారు. పోటీలకు ముఖ్య అతిథులుగా జిల్లా పరీక్షల సహాయ సంచలకులు ఉదయ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మరింత శుచి, శుభ్రతతో కూడిన వంటకాలు అందించడానికి ఇటువంటి పోటీలు ఉపయోగపడతాయన్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సూచనతో నిర్వహించిన పోటీల్లో రుచితో పాటు శుభ్రత పాటించిన ముగ్గురిని బహుమతులకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన వారిలో ప్రథమ బహుమతి ఆసిఫాబాద్ మండలానికి చెందిన భాగ్యలక్ష్మి ఎంపిక కాగా, ద్వితీయ బహుమతి రెబ్బెన మండలం మాయ, తృతీయ బహుమతి కాగజ్‌నగర్ మండలం రేవంత భాయి ఎంపికయ్యారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రాథోడ్ సుభాష్, జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్, ఉపాధ్యాయులు ఉషన్న, హేమంత్, సిసి మోహన్, హెచ్ఎం దేవాజి, ఎస్.ఏ. రవికుమార్, కమ్యూనిటీ మెంబర్ స్వరూప పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండల కేంద్రంలో రైల్వే కాలనీకి చెందిన హెడ్ కానిస్టేబుల్ అంగారి సాయిబాబా ఇంట్లో ఆదివారం రాత్రి ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఉన్న 2.5తులాల బంగారు ఆభరణాలు, 25 తులాల వెండి ఆభరణాలు దొంగిలించినట్లు బాధితుడు తెలిపారు. సాయిబాబా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తునట్టు ఎస్ఐ కమలాకర్ తెలిపారు.

రాష్ట్ర సెపక్‌తక్రా సంయుక్త కార్యదర్శిగా శిరీష

నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ సెపక్ తక్రా రాష్ట్ర సంఘం ఎన్నికల్లో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గోలేటి గ్రామానికి చెందిన పర్లపల్లి శిరీష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం కార్యవర్గ మీటింగ్‌లో 2024-28 కాలానికి ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగిందని ఆయన తెలిపారు. మండలంలోని గోలేటి గ్రామానికి చెందిన పర్లపల్లి శిరీష ప్రస్తుతం బీసీ వెల్ఫేర్ స్కూల్‌లో గన్నవరం గ్రామంలో పనిచేస్తున్నారు. ఏకగ్రీవంగా రాష్ట్ర ఎన్నికలలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నికవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

నేడు ఓటరు నమోదుపై ప్రత్యేక సమావేశం

నవతెలంగాణ-బెజ్జూరు

ఓటరు నమోదుపై మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ గౌరీ శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ఆయా పార్టీల నాయకులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

పోగొట్టుకున్న మొబైల్ అందజేత

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు గత నెలలో మొబైల్ ఫోన్‌లను పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఎస్ఐ ప్రశాంత్ ఈఐఆర్ పోర్టల్ ద్వారా సాంకేతిక టెక్నాలజీని ఉపయోగించి బాధితులు పోగొట్టుకున్న ఫోన్‌లను గుర్తించి సోమవారం అందజేశారు. సదరు వ్యక్తులు మొబైల్ ఫోన్ అందజేసిన ఎస్ఐకి తక్కువ కాలంలో మొబైల్ ఫోన్‌లను తిరిగి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ ఆశ్రమ విద్యార్థిని మృతి

చికిత్స పొందుతూ ఆశ్రమ విద్యార్థిని మృతి

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో అక్టోబర్ 29న ఫుడ్ పాయిజన్ అయి 60 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇందులో ముగ్గురు పరిస్థితి విషయమంగా ఉండడంతో మంచిర్యాల ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్సకు తీసుకెళ్లారు. కాగా ఇందులో విద్యార్థిని శైలజ పరిస్థితి మరింత విషమంగా మారడంతో అక్కడి వైద్యులు వెంటిలెటర్‌పై ఉంచారు. 15 రోజుల నుంచి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ఆ విద్యార్థి సోమవారం మరణించినట్టు కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది. ఇదిలా ఉంటే చికిత్స సమయంలో విద్యార్థినీకి అందుతున్న వైద్య సేవల గురించి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో పాటు ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, రాష్ట్రస్థాయి అధికారులు, ఆయా కుల, విద్యార్థి సంఘాల నాయకులు పరామర్శించారు. అయిన ఆమె చికిత్సల్లో ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో సోమవారం పరిస్థితి విషమించి మరణించింది. మాలీ, విద్యార్థి సంఘాల నాయకులు బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశాయి.



ఆసిఫాబాద్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు



మృతి చెందిన విద్యార్థిని శైలజ(ఫైల్)

విద్యార్థిని మృతికి ప్రభుత్వం అధికారులదే బాధ్యత

ఆసిఫాబాద్ : వాంకిడి మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న శైలజ మృతికి ప్రభుత్వంతో పాటు అధికారులు బాధ్యత వహించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అక్టోబర్ 29న కలుషిత ఆహారంతో తీవ్ర అస్వస్థతకు గురై మంచిర్యాల నుండి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించిన శైలజ సోమవారం మృతిచెందగా ఆమెకు మద్దతుగా జిల్లా కేంద్రంలో ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ సుమారుగా 25 రోజులు శైలజ విద్యార్థిని ప్రాణాలతో కొట్టుమిట్టాడి మరణించడం బాధాకరమన్నారు. బాలిక మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సంఘటనకు కారణమైన అధికారిపై కంటి తుడుపు చర్యలు తీసుకొని చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. సంఘటనకు బాధ్యులైన ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థిని కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లిస్తూ, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం 27న ప్రభుత్వ ప్రయివేటు విద్యాసంస్థల బందుతో పాటు కలెక్టరేట్ ముట్టడి నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు దుర్గం దినకర్, గెడం టికానంద్, జగజంపుల తిరుపతి, ఆత్మకూరి చిరంజీవి, చాప్లే సాయికృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



గుండాల పీహెచ్‌సీని సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

నవతెలంగాణ-తిర్యాణి

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ సవతి గృహాలలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం మండలంలోని రాంపల్లిలో గిరిజన ఆశ్రమ పాఠశాల, గుండాలలో గల ఆశ్రమ పాఠశాల, ఆరోగ్య కేంద్రం, మంగి ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి పాఠశాలల పరిసరాలు, వంటశాల, గదులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని తెలిపారు. తరగతి గదులలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల ఆహారం తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిర్లక్ష్యం, అలసత్వం వహించిన వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. బడి మానేసిన విద్యార్థులను గుర్తించి వారి ఇండ్లకు వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ అందించి పాఠశాలకు విద్యార్థులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మంగిలోని ఆరోగ్య ఉప కేంద్రానికి అవసరమైన మరమ్మత్తులు నిర్వహించి ఆరోగ్య కార్యకర్త అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయా గ్రామాలలోని మహిళ స్వశక్తి సంఘాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సూర్యప్రకాష్, ఎస్ఐ తీగల మాధవ్ గౌడ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి కృష్ణ తేజ, పంచాయితీ రాజ్ ఈఈ ప్రభాకర్, డీఈ రాజన్న, ఏటీడీఓ చిరంజీవి, ఎంపీడీఓ మల్లేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వెటర్లు అందజేసిన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని చేడువాయి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఉపాధ్యాయులు తంగడిపెల్లి రాకేష్ తల్లి శాంత, తండ్రి దత్తు, చౌదరి వెంకటేష్ తండ్రి బాపు స్మారకార్థం పాఠశాలలోని 40 మంది విద్యార్థినులకు స్వెటర్లను పంపిణీ చేశారు. దీనికి పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షులు ఏటుకూరి శ్రీనివాస్‌రావు, హెచ్ఎం, ఎంఈఓ టి.రమేష్ బాబు వాటిని విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు ఏటుకూరి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థినులకు స్వెట్టర్లను అందించడం అభినందనీయమన్నారు. ఎక్కువ హాజరు శాతం ఉన్న 40 మంది విద్యార్థినులకు స్వెట్టర్ అందించడం వారి సేవ తత్పరతను తెలుపుతుందని, విద్యార్థులందరికీ ప్రోత్సహించేదిగా ఉంటుందని, ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తి కలిగిస్తుందని అన్నారు. కార్యక్రమంలో అమ్మ అదర్శ పాఠశాల చైర్మన్ తార, పీఆర్టీయూటీఎస్ మండల అధ్యక్షులు జి.యాదగిరి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చేడ్వాయి హెచ్ఎం అశోక్ చందర్, మాజీ ఎంపీటీసీ సిహెచ్ సత్తయ్య, పంచాయతీ కార్యదర్శి సిహెచ్ రాకేష్, గ్రామ పెద్దలు బాబు, ఇస్మాయిల్, వెంకటేష్, గౌతం, రవి, ఉపాధ్యాయులు ఐ.సంతోష్‌కుమార్, ఎం.రాజకమలాకర్ రెడ్డి, డి.శిల్ప, సిహెచ్ సుమిత, స్వప్న, అబ్దుల్ పాల్గొన్నారు.



స్వెటర్లు అందించిన తరువాత విద్యార్థులతో ఉపాధ్యాయులు

స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలి



డీఆర్ఓకు ఫిర్యాదు చేస్తున్న విశ్రాంత ఉద్యోగి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని రహపల్లి యూపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసి ఉద్యోగ విరమణ అనంతరం రావల్సిన బెన్ఫిట్స్‌ను మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న బూరుగూడ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలని విశ్రాంత ఉద్యోగి టి. సత్యనారాయణ కోరారు. తనకు ప్రభుత్వం నుండి రావల్సిన బెన్ఫిట్స్‌ను విడుదల చేయడంలో న్యాయం చేయాలని సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో ఆర్డీఓ లోకేశ్వర్‌రావుకు ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతు మార్చి 2024 నుండి రావల్సిన 18 సంవత్సరాల స్కేల్ మంజూరు చేయకుండ వేధిస్తున్నారని, వైద్య బిల్లులు మార్చి 2024 నుండి సంబంధిత అధికారికి సకాలంలో అందించక పోవడంతో మంజూరుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ విరమణాంతరం రావల్సిన (పీఆర్సి ఏరియర్స్ 2020) బిల్లులను ట్రెజరీ అధికారులకు పంపించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. అదే విధంగా 18 సంవత్సరాల స్కేల్ని మంజూరు చేయకపోవడంతో పెన్షన్ పత్రాలు పంపకపోవడంతో రిటైర్ అయి 6 నెలలు కావస్తున్నా పెన్షన్ మంజూరు కాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందిగా మారిందని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆసిఫాబాద్ సబ్ డివిజన్ షీటీం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళలు, పిల్లలను రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు మరింత దగ్గరై సేవలు అందిస్తున్నామని, ఏదైనా సమస్య ఉంటే డయల్ 100కు కాల్ చేయాలని, స్థానిక పోలీస్ అధికారులకు తెలియజేయాలని, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, లైంగికంగా వేధించటం, వెంటపడటం ఇటువంటి చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలికలను ఎవరైనా వేధిస్తే ఆసిఫాబాద్ షీటీం నంబర్ 8712670564కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాందాస్, షీటీం సిబ్బంది సునీత, శ్రీలత అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రక్షణ పక్షోత్సవాల కార్యాచరణ



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాల నిర్వహణ కోసం కార్యాచరణపై జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఆయా విభాగాల అధిపతులతో జీఎం ఎం.శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 9 నుండి 21 వరకు చేయాల్సిన ఏర్పాట్లు, రక్షణ చర్యలపై అధికారులకు సూచనలిచ్చారు. ఈ పక్షోత్సవాల్లో ప్రతి ఉద్యోగికి సేఫ్టీ మేనేజ్ మెంట్ ప్లాన్‌పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. రక్షణలో బెల్లంపల్లి ఏరియాకు మొదటి బహుమతి వచ్చేలా ప్రతి ఉద్యోగి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం కె.రాజమల్లు, ఏరియా ఇంజినీర్ భీంరావ్ జాడే, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, డీజీఎం (వర్క్ షాప్) కృష్ణమూర్తి, సివిల్(ఎస్ఈ) మదీనాబాషా, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

రేపు లోక్ అదాలత్ సన్నాహక సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో డిసెంబర్ 14న జిల్లా కేంద్రంలోని కోర్టు భవనం ఆవరణలో జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి గాను ఈనెల 27న సాయంత్రం 5 గంటలకు కోర్టు భవనంలో సన్నాహక సమావేశం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్, బ్యాంకింగ్, విద్యుత్, భూతగాదాలు, వివాహ, కుటుంబ కేసులు, వాహన ప్రమాదాలు, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ ఇతర కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు తమ పరిధిలోని కేసుల పూర్తి వివరాలతో సన్నాహక సమావేశానికి హాజరు కావాలన్నారు.

సింహ గర్జనకు తరలి రావాలి



నవతెలంగాణ-కౌటాల

హైదరాబాద్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహ గర్జనకు మాల మహర్, నేతకాని ఉపకులాలు అధిక సంఖ్యలో హాజరు కావాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ కోరారు. సోమవారం సింహగర్జనకు సంబంధించిన కరపత్రాలను మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 75 సంవత్సరాల నుండి ఎస్సీ కులాలలో ఉపకులాలు చదువు, రాజకీయం, ఉద్యోగాల్లో వెనకబడి ఉన్నారని తెలిపారు. హక్కుల సాధన కోసం అందరు ఐక్యతతో కలిసి పోరాటం చేయాలన్నారు. ఇంటికొక్కరు తరలి వచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ సుభాష్, మాల మహానాడు కార్యకర్తలు ఎడ్ల శ్రీనివాస్, పత్తి మల్లేష్, మొగిలి వెంకటేష్, జయదేవ్, నర్సయ్య, కడారి శ్రీనివాస్, బండు రావ్ పుల్జెలే, కొండాగుర్లే దేవాజీ, జాడి దిలీప్ కుమార్, దుర్గం వెంకటేష్, ఏమాజీ, మారుతీ, విజయ్ పాల్గొన్నారు.

వసతి గృహాల నిర్వహణ మెరుగుపరచాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో వసతి గృహాల నిర్వహణ మెరుగుపరిచి విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్ డిమాండ్ చేశారు. ప్రజావాణిలో భాగంగా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో నిర్వహణపై ప్రత్యేక కమిటీ వేయాలన్నారు. ఆదర్శ డిగ్రీ కళాశాల సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రతి వసతి గృహాలలో వేడి నీటి యంత్రాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో బీసీ బాలికల కళాశాల హాస్టల్ భవనం పూర్తయిన ప్రారంభానికి నోచుకోలేదని త్వరగా ప్రారంభించాలన్నారు. ఎంజేపీ బాలుర గురుకుల వసతి గృహంలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. ఆసిఫాబాద్ ఎస్సీ బాలుర వసతి గృహానికి అదనపు గదులు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు చాపిడి శ్రావణి, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శిలు ఆత్మకూరు సతీష్, వడ్లూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

పాన్ కార్డుతో ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ఉద్యోగులు ఆధాయ పన్ను శాఖ నిబంధన మేరకు తమ పాన్ కార్డును ఆధార్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు బెల్లంపల్లి ఏరియాలో సుమారు 15 మంది ఉద్యోగులు తమ పాన్ కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసుకోలేదన్నారు. జాప్యం కొనసాగితే ఆధాయ పన్ను నిబంధన ప్రకారం అదనంగా 20 శాతం జరిమానా కూడా విధించబడుతుందన్నారు. ఉద్యోగులు వెంటనే తమ పాన్ కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

టీయూటీఎఫ్ రాష్ట్ర కమిటీలో చోటు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర కార్యవర్గంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఉపాధ్యాయులకు చోటు దక్కింది. ఇటీవల ఆదిలాబాద్‌లో నిర్వహించిన సంఘం రాష్ట్ర మహాసభలలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోగా ఇందులో రాష్ట్ర సహాధ్యక్షుడిగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ముంజం శ్యాంరావు, సంయుక్త కార్యదర్శిగా మన్నె లక్ష్మినారాయణ, కార్యదర్శిగా సిహెచ్ రవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా దున్న దామోదర్‌లు ఎన్నికైనట్లు టీయుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బత్తుల శాంతికుమార్, ప్రధాన కార్యదర్శి పెండ్యాల సదాశివ్ తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | నవంబర్ 26, 2024 | www.navatelangana.com

అటవీ క్షేత్రాన్ని పరిశీలించిన లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల్ అటవీ క్షేత్రాన్ని సోమవారం లక్షెట్టిపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ఆసదుల్లా షరీఫ్ పరిశీలించారు. గోండుగూడా, బైసన్ కుంట, నీళ్ గాయకుంట, మహమ్మదాబాద్, అలీనగర్ వాచ్‌టవర్ అటవీ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా అడవి, వన్యప్రాణుల రక్షణకు అటవీ అధికారులు తీసుకుంటున్న చర్యల గురించి తెలుసుకున్నారు. అలాగే అటవీ అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో జన్నారం ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ సుష్మారావు, బీట్ ఆఫీసర్ శ్రీనివాస్ ఉన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించిన తహసీల్దార్

నవతెలంగాణ-తాండూర్



బుచ్చయ్యపల్లి మందమర్రి మధ్య చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల సమస్యను బెల్లంపల్లి తహసీల్దార్ జోష్ణ సోమవారం పరిష్కరించారు. గ్రామస్తులందరిని సమీకరించి నచ్చజెప్పి హద్దులను గుర్తించారు. రోడ్డు నిర్మాణం వల్ల రవాణా వ్యవస్థ మెరుగుపడి ప్రాంత పరిసరాల్లోని భూమి విలువ పెరుగుతుందని గ్రామస్తులకు తెలిపారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పథకాలను అర్థం చేసుకొని సహకరించాలని కోరారు. రోడ్డు నిర్మాణ పనులు అడ్డుకోరాదని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మురళీధర్ రావు పాల్గొన్నారు.

సింగరేణి నూతన బొగ్గు గనుల ఏర్పాటుకు కృషి చేస్తా

- ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి నూతన బొగ్గు గనుల ఏర్పాటుకు కృషి చేస్తానని ఉమ్మడి అదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి ప్రాంతంలో పర్యటించారు. ఇందారం క్రాస్ నుండి సుమారు 100 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్కే న్యూటెక్ గనిని సందర్శించి పట్టభద్రులందరినీ కూడా ఎమ్మెల్సీ ఓటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి బొగ్గు గనుల ప్రధాన సమస్యలైనా సింగరేణిలో ఇన్‌కం టాక్స్ తగ్గించాలని, ఇంటర్నల్ కార్మికుల అర్హతలను బట్టి సూటబుల్ జాబ్ ఇవ్వాలన్నారు. పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని, ఓటు నమోదు చేసుకోని వారు రిజెక్ట్ అయిన వారు మరలా నవంబర్ 23 నుండి డిసెంబర్ 9 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని పట్టభద్రులు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఆల్ ఫోర్స్ జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రెగళ్ళ ఉపేందర్, జిల్లా కోశాధికారి కృష్ణారెడ్డి, మైదం రామకృష్ణ, ఉట్ల సత్యనారాయణ, అంబాల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాల ఆటాపాట



నవతెలంగాణ-హాజీపూర్

ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారధి కళాకారులు సోమవారం హాజీపూర్ మండలంలో తమ ఆటాపాటల ద్వారా అవగాహన కలిపించారు. కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు డీపీఆర్ ఆధ్వర్యంలో మండలంలోని దొనబండ, నబ్బెపల్లి గ్రామాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలపై ఆటాపాటలతో కళాకారులు అవగాహన కలిపించారు. రానున్న రోజుల్లో మరెన్నో సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పాటల ద్వారా చెప్పారు. డిసెంబర్ 7వ తేదీ వరకు ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలను తెలంగాణ సాంస్కృతిక సారధి కళాయాత్ర కొనసాగుతుందని తెలిపారు. సారధి కళాకారులు లావుడ్యా రమేశ్, మామిళ్ల లచ్చన్న, గొడిసెల కృష్ణ. సల్లూరి కృష్ణ. రాంటింకి రాజాతిరుపతి, వావిలాల నాగలక్ష్మి పాల్గొన్నారు.

'ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ, కార్మికుల సంక్షేమంపై లేదు'

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి యాజమాన్యానికి ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై లేదని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణిలో పనిచేస్తున్నటువంటి ఉద్యోగులకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నెలలో ఇచ్చే వామ్ కోట్‌లను శీతాకాలం మొదలై చలి తీవ్రత ఎక్కువగా ఉన్న ఇప్పటివరకు అందజేయలేదని ఆరోపించారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమానికి, భద్రత కొరకు రూ.లక్షల కర్చు పెడుతున్నామని చెప్తున్నారే కానీ ఆచరించడం లేదని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంపై శ్రద్ధ చూపకపోవడం వల్ల వారి ఆరోగ్యం క్షీణించే అవకాశం ఉన్నందున యాజమాన్యం ఇప్పటికైనా వామ్ కోట్‌లను అందించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసాలు



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని మాదారం-3 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు. అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులందరికీ పంపిణీ చేయాలని సూచించారు. బాలింతలు, గర్భిణులు పోషకాహారాన్ని తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ ద్వారా అందించే ప్రీ స్కూల్ విద్య గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కుశ్నపల్లి మీనా, గర్భిణీ స్త్రీలు, పిల్లలు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఉన్న శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి రామాలయంలో హైకోర్టు మాజీ జడ్జీ పీఎస్ నారయణతో కలిసి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు మాజీ జడ్జి, రాష్ట్ర మాజీ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ జి చంద్రయ్య సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆలయం పక్కలకు నూతనంగా ఏర్పాటుచేసిన శివాలయం, సత్యనారాయణ స్వామి ఆలయాల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు.

వడ్ల గింజలు తిని 64 గొర్రెలు మృతి

- 10 గొర్రెల పరిస్థితి విషమం
- పోస్టుమార్టం చేసిన పశువైద్యులు



నవతెలంగాణ-హాజీపూర్

మేతకు వెళ్లి గొర్రెలు వడ్ల గింజలు తినని ఏకంగా 64 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన హాజీపూర్ మండంలో చోటు చేసుకుంది. పూర్తి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.. మండలంలోని నంనూర్ గ్రామానికి చెందిన పలువురి మందల నుంచి గొర్రెల కాపరులు శనివారం గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రాలకు మేతకు తీసుకువెళ్లారు. ఆ రోజు బాగానే ఉన్న గొర్రెలు ఆదివారం మేతకు వెళ్లగా మధ్యాహ్నం నుంచి ఒకొక్కటిగా మృత్యువాత పడుతూ రాత్రి వరకు 30 గొర్రెలు చనిపోయాయి. ఆదివారం రాత్రి నుంచి మండల పశువైద్యాధికారిణి డాక్టర్ శాంతిరేఖ ఆధ్వర్యంలో గొర్రెలకు చికిత్స అందిస్తున్న సోమవారం ఉదయం వరకు మరో 34 గొర్రెలు చనిపోగా మొత్తంగా 64 గొర్రెలు మృతి చెందగా మరో 10కి పైగా గొర్రెలు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. కాగా నంనూర్‌కు చెందిన గోపు రాజ్ కుమార్‌కు చెందిన 17 గొర్రెలు, గోపు కొమరయ్య చెందిన 16 గొర్రెలు, గోపు మల్లేశ్‌కు చెందిన 16 గొర్రెలు, గోపు రమేశ్ చెందిన 15 గొర్రెలు చనిపోయాయి. చనిపోయిన గొర్రెలకు డాక్టర్ శాంతిరేఖ పోస్టుమార్టం నిర్వహించగా అన్ని గొర్రెలు కూడా వడ్ల గింజలు అధిక మొత్తంలో తిని చనిపోయినట్లు ధ్రువీకరించారు. గొర్రెల యజమానుల అనుమానాల మేరకు అవి ఎలా చనిపోయాయనే నిర్ధారణ మేరక గొర్రెల అవయవాలను ఆదిలాబాద్‌లోని పశు వ్యాధుల డైగ్నోస్టిక్ ల్యాబ్‌కు పంపించినట్లు డాక్టర్ శాంతిరేఖ తెలిపారు. చనిపోయిన మొత్తం గొర్రెల విలువ రూ. 6 లక్షలపైగా ఉంటుందని పశుయాజమానులు తెలిపారు. ప్రభుత్వం తమకు పరిహారం అందజేసేలా చూడాలని కోరుకుంటున్నారు.

స్పందించిన కలెక్టర్.. ఎమ్మెల్యే

నంనూర్‌కు చెందిన గొర్రె యజమానులకు చెందిన 64 గొర్రెలు మృత్యువాత పడటంతో స్పందించిన కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావులు ఆర్థిక చేయూతకు ముందుకు వచ్చారు. గొర్రెల యజమానులు ఆర్థికంగా అంతంత మాత్రంగా ఉండటం తమ ఉపాధికి కారణమైన గొర్రెలు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడటంలో కలెక్టర్ కుమార్ దీపర్ తన నిధుల నుంచి రూ.2 వేలు, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు వ్యక్తిగతంగా రూ.1 వెయ్యి కలిపి మొత్తం ఒక్కో గొర్రెకు రూ.3 వేల చొప్పున పరిహారం అందించనున్నారు.

నేటి దేశవ్యాప్త నిరసనలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-జన్నారం

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విదానాలను ఎండగడుతూ మంగళవారం చేపడుతున్న దేశవ్యాప్త నిరసనలు జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) మండల అధ్యక్షుడు కనికరం అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు గుడ్ల రాజన్న అన్నారు. సోమవారం మండలంలోని సేవాదాస్‌నగర్‌లో దేశవ్యాప్త నిరసన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కేంద్రంలో మూడవసారి అధికారానికి వచ్చిన బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదని, బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం దేశ స్వాతంత్రాన్ని, స్వావలంబనలను తాకట్టుపెడుతున్నదన్నారు. నిత్యం స్వదేశీ జపం చేస్తూ, విదేశీ సంస్థలకు సాగిల పడుతుందన్నారు. మన జాతీయ సంపదను, వనరులను లూటీ చేస్తుందని, అనేక త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి సమ్మె హక్కులను కాలరాస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వ వినాశకర విధానాలను కార్మిక వర్గం, రైతులు, వ్యవసాయ కార్మికులు నవంబర్ 25న మండల కేంద్రాల్లో, 26న జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలపాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జయక్క, అబ్దుల్లా, అంబటి లక్ష్మణ్, లక్ష్మీ, రాజవ్వ పాల్గొన్నారు.

30న బీసీ ఐక్య సదస్సును విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

జిల్లా కేంద్రంలో ఈ నెల 30న నిర్వహించనున్న బీసీ ఐక్య సదస్సును కోల్బెల్టు ప్రాంతవాసులు విజయవంతం చేయాలని సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం పిలుపునిచ్చారు. సోమవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో బీసీ ఐక్యవేదిక నాయకులతో కలిసి సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మెజారిటి వర్గంగా ఉన్న బీసీలకు అడుగడుగునా అన్యాయమే జరుగుతున్నదని ఆరోపించారు. బీసీ కులాల వారికి హాని తలపెడుతున్న ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రిజర్వేషన్ కారణంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, వర్గాల వారికి అన్యాయం జరుగుతోందని, అత్యుత్తమ ఫలితాలు సాధించినా ఉద్యోగాల సాధనలో అవకాశం దక్కకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత దేశంలో 65 శాతం జనాభా ఉన్న బీసీలకు దక్కాల్సిన న్యాయమైన వాటా దక్కడం లేదని, ఈ విషయంలో బీసీ బిడ్డలు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరముందని అన్నారు. బీసీ వర్గాల న్యాయమైన హక్కులను పట్టించుకునే పాలకులు లేకుండా పోయారని విమర్శించారు. జిల్లాకేంద్రంలోని హెచ్‌బీ ఫంక్షన్ హాలులో శనివారం జరగనున్న బీసీ ఐక్య సదస్సుకు శ్రీరాంపూర్ సింగరేణి ప్రాంతంలోని బీసీ వర్గాల ప్రజలు, సింగరేణి ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, బీసీ ఐక్య వేదిక జిల్లా నాయకులు కనుకుంట్ల మల్లయ్య, చల్లమల్ల అంజయ్య, పెట్టం లక్ష్మణ్, బద్రి బుచ్చన్న, మారుతి పెద్దొల్ల చంద్రకాంత్ నస్పూరి అఖిల్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా చేతిపంపు

- నీటి కోసం కాలనీవాసుల ఇబ్బందులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మున్సిపాలిటీ పరిధిలోని లంబాడి తండాలో చేతి పంపు నిరుపయోగంగా మారింది. గత మూడు నెలల నుంచి పని చేయడం లేదని మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి చేతి పంపును మరమతులు చేపడతామని విప్పి మూలన పడేశారు. అందులో ఉన్న ఫుట్ బాల్ పని చేయడం లేదని కొత్తది తీసుకొచ్చి మరమ్మతులు చేస్తామని చెప్పి వెళ్ళిపోయారు. దానికి సంబంధించిన భాగాలను కాలనిలో పలు ఇండ్లలో పెట్టారు. ఇప్పటికి రోజులు గడుస్తున్న మున్సిపల్ అధికారులు అటువైపు చూసిన పాపాన పోలేదు. అధికారుల నిర్లక్షానికి కాలని వాసులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. దసరా పండుగ ముందు నుంచి నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారుతున్నారు. చేతిపంపు ప్రారంభించడమే కాకుండా దానిని శుభ్రం చేపించాలని కోరారు. పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ పనులు చేయించడంలో లేదని ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చేతిపంపును వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.



బావి నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నాం



భుక్యా చిలకాబాయి, లంబాడితండా

గత రెండు నెలల నుంచి బావి నుంచి నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నాం. బావి నుంచి మోసుకుంటుంన్నాం. మిషన్ భగీరథ నీళ్లు రెండు, మూడు రోజులకు ఒక సారి రావడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులు స్పందించి వెంటనే చేతి పంపును మరమతులు చేయించి సమస్య పరిష్కరించాలి.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని నస్పూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్‌లో ఏర్పాటు చేసిన గాయత్రి బ్యాంక్ 50వ శాఖను జిల్లా సహకార అధికారి బి.సంజీవరెడ్డి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వనమాల శ్రీనివాస్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంక్ శాఖ వినియోగదారుల ఆర్థిక ప్రగతికి చేయూత అందించాలని, 2000 సంవత్సరంలో స్థాపించిన గాయత్రి బ్యాంకు మల్టీస్టేట్ బ్యాంక్‌గా రూ. 2939.45 కోట్ల వ్యాపారాన్ని సాధించి 50 శాఖలతో ముందుకు సాగుతుందని, ఆర్థిక క్రమశిక్షణతో ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని తెలిపారు. జిల్లా సహకార అధికారి మాట్లాడుతూ 24 సంవత్సరాల కాలంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 50 శాఖలతో, 7 లక్షల 39 వేల మంది వినియోగదారులను కలిగి ఉండి అన్ని విధాలుగా అభివృద్ధిని సాధించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ బింగి తిరుపతి, బ్యాంక్ జనరల్ మేనేజర్ శ్రీలత, సంబంధిత అధికారులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ గణిత ఫోరం మండల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ గణిత ఫోరం మండల కమిటీని గణిత ఉపాధ్యాయులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గణిత ఫోరం మండల అధ్యక్షుడిగా ఎస్ సదానందం(జిల్లా పరిషత్ హై స్కూల్ జన్నారం) గౌరవ అధ్యక్షుడు కందుల తిరుపతి, (జిల్లా పరిషత్ హై స్కూల్ మురిమడుగు), ప్రధాన కార్యదర్శిగా ముఖ్య తిరుపతి(జిల్లా పరిషత్ హై స్కూల్ కామన్ పల్లి)ఉపాధ్యక్షులుగా జి రజిత రాణి (జిల్లా పరిషత్ హై స్కూల్ కిష్టాపూర్) ఎం అంజన్న (జిల్లా పరిషత్ హై స్కూల్ ఇంధన్‌పల్లి,) కోశాధికారిగా గోవర్ధన్ ఆచారి(జిల్లా పరిషత్ హై స్కూల్ కిష్టాపూర్), కార్యదర్శిగా బి దేవ్ సింగ్(జిల్లా పరిషత్ హై స్కూల్ కిష్టాపూర్,) కార్యవర్గ సభ్యులుగా విద్యాసాగర్, విజయకాంత్, జాడి రాజన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

స్టోర్ సమస్యలపై ఏఐటీయూసీ వినతి



నవతెలంగాణ-మందమర్రి

ఏఐటీయూసీ స్టోర్ పిట్ కార్యదర్శి కె ఓదెలు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ఏరియా స్టోర్ గేట్ మీటింగులో స్టోర్ సమస్యలపై డీవైజీఎం పైడీశ్వర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీమ నాధుని సుదర్శన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో కొత్తగూడెంలో సెంట్రల్ స్ట్రక్చర్ కమిటీ సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ కోల్ ఇండియా మాదిరిగా సింగరేణి యాజమాన్యమే భరించాలని, సొంతింటి కల సహకారం, ప్రమోషన్ పాలసీ డిమాండ్లతో ఈ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. సింగరేణి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎగ్గెటి రాజేశ్వరరావు, వర్క్ షాప్ పిట్ కార్యదర్శి సీహెచ్‌పీ శర్మ, స్టోర్ నాయకులు బియ్యాల తిరుపతి, సదానందం, రామకృష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, హరికృష్ణతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఆదిలాబాద్
మంగళవారం | నవంబర్ 26, 2024 | www.navatelangana.com

డిగ్రీ పరీక్షల టైం టేబుల్‌లో స్వల్ప మార్పు

● పలు పరీక్షలు డిసెంబర్‌కు వాయిదా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 26నుంచి ప్రారంభం కావాల్సిన పరీక్షల్లో పలు పరీక్షలు వాయిదా పడగా టైం టేబుల్‌లో స్వల్ప మార్పులు చేసినట్టు కేయూ అధికారులు సోమవారం పేర్కొన్నారు. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షలు ఫీజు రియంబర్స్‌మెంటు విడుదల విషయంలో ప్రయివేటు యాజమాన్యాలు గత కొన్నిరోజులుగా నిరసన తెలుపుతున్నాయి. ఈ క్రమంలో నవంబర్ 26, 27, 28 తేదీల్లో జరిగే పరీక్షలు వాయిదా పడ్డాయని పేర్కొన్నారు. నవంబర్ 26 జరగాల్సిన పరీక్ష డిసెంబర్ 27న, నవంబర్ 27న పరీక్ష, డిసెంబర్ 28న, నవంబర్ 28వ తేదీ పరీక్ష డిసెంబర్ 30 ఉంటుందని కేయూ అధికారులు వెల్లడించారు. మిగతా పరీక్షలు అన్నీ కూడా యథాతథంగా గత టైం టేబుల్ ప్రకారం జరుగుతాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డిగ్రీ విద్యార్థులు గమనించాలని సూచించారు.

పోలీస్‌స్టేషన్‌కు బారికేడ్స్ అందజేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్



క్రెడిట్ ఆక్సెస్ ఇండియా ఫౌండేషన్ తరపున కాగజ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు సోమవారం పది బారికేడ్స్‌ను అందించారు. ఈ సందర్భంగా సీఐ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో ప్రమాద హెచ్చరికలను సూచించేందుకు బారికేడ్లు ఉపయోగపడతాయని, నాణ్యమైన బారికేడ్లను అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్, క్రెడిట్ ఆక్సెస్ ఇండియా ఫౌండేషన్ ఏరియా మేనేజర్ చంద్రశేఖర్, బ్రాంచ్ మేనేజర్ రామేశ్వర్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో జరిగే నిరసన ర్యాలీలను జయప్రదం చేయాలి

● టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

కార్మిక రైతు ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం నిర్వహించే దేశవ్యాప్త నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి రాజన్న కోరారు. సోమవారం నిర్మల్‌లో నిరసన ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ విధానం రద్దుచేసి కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మెంటు చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ప్రభుత్వరంగ సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. అందరికీ ఉద్యోగ భద్రత కల్పించి హామీ ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు ఐఆర్ పెన్షన్ అలాగే సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లానాయకులు గంగామణి, కమల, తశ్రీన్, కవిత, పి.లక్ష్మి, రుక్మ, వసంత, చిట్టి పాల్గొన్నారు.

అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజావాణిలో వచ్చే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి పరిష్కారం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. విద్య, వైద్యం, పంచాయతీ, పెన్షన్, ఉపాధి, పరిశ్రమల శాఖలకు సంబంధించి 63 దరఖాస్తులు వచ్చాయి. అధికారులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వినోద్ కుమార్, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ జితేందర్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ కార్మికుడు మృతి

నవతెలంగాణ-ఉట్నూర్

విద్యుత్‌శాఖ కార్మికుడు పురుగులమందు తాగి మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. మండలంలోని శ్యామ్‌నాయక్ తండాకు చెందిన జాదవ్ భిక్కు(34) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పురుగులమందు తాగి సోమవారం మృతి చెందాడు. వారి కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

జాదవ్ కృష్ణకు సన్మానం



నవతెలంగాణ- ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ మున్సిపాలిటీలో రెవెన్యూ అధికారి(ఆర్ఓ)గా పనిచేసి ఇటీవల కమిషనర్‌గా ఉద్యోగోన్నతి పొందిన ఆదిలాబాద్ పట్టణానికి చెందిన జాదవ్ కృష్ణను పలువురు సన్మానించారు. సోమవారం టీఎన్జీఓ సంఘ భవనంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అశోక్, ఎ.నవీన్‌కుమార్, సంఘం నాయకులు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బంజారా సంఘం జిల్లా నాయకుడు రాథోడ్ సురేష్ సన్మానించి అభినందనలు తెలిపారు.

క్రికెట్ టీమ్‌కు స్పాన్సర్‌గా మౌనిష్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో గత కొన్ని రోజులుగా క్రికెట్ లీగ్ పోటీలు జరుగుతున్నాయి. పోటీల్లో భాగంగా సోమవారం దేవాపూర్, బ్లూస్టార్ టీమ్‌ల మధ్య పోటీ జరిగింది. ఈ పోటీలకు పట్టణానికి చెందిన సామజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి హాజరయ్యారు. టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కాగా దేవాపూర్ టీమ్‌కు ఆయన స్పాన్సర్‌గా వ్యవహరించారు.

గిరిజన కళాకారుడుకి సన్మానం

నవతెలంగాణ-ఉట్నూర్

న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో గిరిజన కళాకారుల చిత్రాకళ ప్రదర్శనలో పాల్గొన్న డిగ్రీ పూర్వ గిరిజన విద్యార్థి మడావి అనంద్‌రావ్‌ని సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టి.ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో చదువుకున్న పూర్వ డిగ్రీ గిరిజన విద్యార్థి న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్ నిర్వహించిన చిత్రకళలలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి గిరిజన విద్యార్థి ఆనంద్‌రావ్ ప్రదర్శనలో తన ప్రతిభను చూపెట్టుకున్నరన్నారు. రాష్ట్రపతి చేతుల మీదుకు ప్రశంస పత్రం అందుకోవడం కళాశాలకే గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి ప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ నర్సింగ్‌రావ్, రాజశేఖర్, శ్రీకాంత్, కరుణాకర్, డాక్టర్ కిషన్, డాక్టర్ శ్రీనివాస్, రాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ

నవతెలంగాణ-ఖానాపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం మత్స్యశాఖ అభివృద్ధి పథకం ద్వారా 2024-25 సంవత్సరం 100శాతం రాయితీపై చేప పిల్లలను పంపిణీ చేశారు. ఖానాపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మున్సిపల్ చైర్మెన్ రాజురా సత్యం ఖానాపూర్ పట్టణ, పలు గ్రామాలకు చెందిన మత్స్య కారులకు చేప పిల్లలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సునీత, ఎఫ్డిఓ విజయ్ కుమార్, ఖానాపూర్ మత్స్య సంఘం అధ్యక్షులు పరిమి సురేష్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు నిమ్మల రమేష్, నాయకులు లక్ష్మీపతిగౌడ్, తిరుపతిగౌడ్, ఫీల్డ్ ఆఫీసర్స్ రాజేందర్, రంజిత్ కుమార్, ఖానాపూర్ గంగపుత్ర సంఘం సభ్యులు గణేష్, నవీన్ పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రయివేట్ పాఠశాలలో సోమవారం జిల్లా భరోసా టీం, కాగజ్‌నగర్ డివిజన్ షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భరోసా టీం ఇన్‌ఛార్జి ఎస్ఐ తిరుమల అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టం, అమలులో ఉన్న శిక్షలు, బాల్య వివాహాక నిరోధక చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, షీటీం సభ్యులు, భరోసా టీం సభ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియకు ఉపాధ్యాయులను మినహాయించాలి

● టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు స్వామి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

రాష్ట్రంలో గత 15 రోజుల నుంచి చేపట్టిన ఆర్థిక, సామాజిక, కులగణన సర్వేను ఆన్‌లైన్ చేసే ప్రక్రియ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎ.స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ మండల మహాసభను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత 15 రోజుల నుంచి ఒక పూట పాఠశాల విధులు నిర్వహిస్తూ, మరో పూట సర్వే చేసిన సందర్భంలో ఇప్పటికే ప్రాథమిక విద్య వెనుకబాటుకు గురైందని, మళ్లీ సర్వే ఆన్‌లైన్ పేరిట కూడా ఉపాధ్యాయులకు విధులను కేటాయిస్తే, పిల్లలు ప్రాథమిక విద్యకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రాథమిక ఉపాధ్యాయులకు పూర్తికాలం బోధన చేసే వీలు కల్పించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయంగా ప్రణాళిక శాఖ ద్వారా సూపర్‌వైజర్లతో ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని కేజీబీవీ, యూఆర్ఎస్ సిబ్బంది అందరికీ కనీస వేతన చట్టం వర్తింపజేస్తూ మినిమం టైం స్కేల్ చెల్లించాలని, రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా అన్ని సెలవులు వర్తింపజేయాలని అన్నారు. కేర్ టేకర్లను నియమించాలని, హెల్త్ కార్డులను మంజూరు చేయాలని అన్నారు. సర్వీస్‌లో మరణించిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ విషయమై పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తూ రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి ప్రాతినిధ్యం కూడా చేసిందని, మూడు దశల్లో పోరాటాల్లో భాగంగా ఈనెల 27, 28న మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.శ్యాంసుందర్, మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాపూరావు, రాజేందర్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు రాజశేఖర్, బాధ్యులు మల్లయ్య, విజయ్ కుమార్, రవీందర్, సిడం రాజేందర్, భరత్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల పక్షాన అసెంబ్లీలో మాట్లాడాలి

● కౌలు రైతులకు న్యాయం చేయాలి

● రైతు స్వరాజ్య వేదిక నాయకుల వినతి



నవతెలంగాణ-భైంసా

కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం న్యాయం చేయడం లేదని, రైతుల పక్షాన అసెంబ్లీలో తమ గళాన్ని వినిపించాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు రైతు స్వరాజ్య వేదిక నాయకులు వినతిపత్రాన్ని అందించారు. సోమవారం తన నివాసంలో కలిసి రైతుల సమస్యలపై మాట్లాడారు. కౌలు రైతులకు ఎల్ఈసీ కార్డులతో పాటు, రైతు భరోసా పథకం వర్తించేటట్టు చూడాలన్నారు. రాష్ట్రంలో లక్ష 17వేల కౌలు రైతులు ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వారికి అన్యాయం చేస్తుందన్నారు. ఇప్పటివరకు రైతాంగానికి రైతు భరోసా నిధులు అందడం లేదని ఈ విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించాలన్నారు. అదేవిధంగా 50 శాతం మంది రైతులకు ఇప్పటికి రుణమాఫీ రావడం లేదని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందరికీ రుణమాఫీ అందేలా చూడాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడుతానని, రైతులకు న్యాయం చేసే వరకు పోరాడుతానన్నారు. కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న, రైతులు మాణిక్‌రావ్, లస్మన్న, కిష్టు, సతీష్, వెంకటేష్, వివేకానంద ఉన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు చేరాలి



నవతెలంగాణ-బోథ్

పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పోటీ పరీక్షల నిపుణులు అల్లం సాయికృష్ణ, రమణగౌడ్ గోడిసెల అన్నారు. సోమవారం బోథ్ మండలంలోని ధన్నూర్(బి) ఉన్నత పాఠశాలలోని పదో తరగతి చదివే విద్యార్థులకు పరీక్షలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. పాఠ్యాంశాలను అర్థం చేసుకొని చదివితే మంచి మార్కులు పొందవచ్చన్నారు. ముఖ్యంగా పరీక్షలు అంటే భయం వీడాలని, క్రమశిక్షణ పట్టుదలతో చదివి సమాజంలో ఉత్తమమైన పౌరులుగా మారాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల, గ్రామం పేరును నిలబెట్టే విధంగా నడుచుకోవాలని సూచించారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవ మర్యాదలు లభిస్తాయని తెలియజేశారు. పదో తరగతి పూర్తయ్యాక ఉండే కోర్సులు వాటి కాలపరిమితి అవి పూర్తయ్యాక ఉండే ఉన్నత విద్య కోర్సులు వాటి వలన భవిష్యత్‌లో ప్రభుత్వ ప్రయివేట్ రంగాలలో ఉండే ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు చోప్డే, రావుల శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరి గ్రామాల కష్టాలను తీర్చడానికే కాంగ్రెస్ ప్రభుత్వం



నవతెలంగాణ-తిర్యాణి

మారుముల ప్రాంతాల్లోని గిరి గ్రామాల ప్రజల కష్టాలను తీర్చడానికే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆ పార్టీ పార్లమెంటు నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. సోమవారం కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా నాయకులు అనిల్ గౌడ్‌తో కలిసి మండలంలోని మారుమూల గ్రామాల రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిత్తారి సాగర్ ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గిరి జన గ్రామాల్లో రోడ్ల సౌకర్యాన్ని కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కూడా అతి త్వరలో తిర్యాణి మండలానికి రానున్నట్లు తెలిపారు. మారుముల గ్రామాలకు రోడ్ల ఏర్పాటు చేసే క్రమంలో కొద్దిగా అడవి శాఖకు సంబంధించిన ఇబ్బందులు ఉన్న వాటిని అధిగమించడానికి క్షేత్రస్థాయిలో ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. మారుమూల గిరిజనుల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిత్తారిసాగర్, మాజీ సర్పంచ్ కొట్నాక గణపతి, మండల యూత్ అధ్యక్షులు పున్నం కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు పడిగేల అమర్, సోషల్ మీడియా అధ్యక్షులు బొక్కెనపల్లి కిరణ్ కుమార్, కాంగ్రెస్ యూత్ నాయకులు అంకతి శ్రావణ్, రాహుల్, పెరుమండ్ల రంజిత్ గౌడ్, మ్యన రాజు పాల్గొన్నారు.

కండ్లు దానం చేయడం అభినందనీయం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సమాజహితం కోసం మరణానంతరం కళ్లదానం చేయడం అభినందనీయమని సదాశయ ఫౌండేషన్ అధ్యక్షులు వెల్ది అనంత రాములు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణం మేన్ మార్కెట్‌కు చెందిన వ్యాపారి మిట్టపల్లి మహేష్ ఈ నెల 15న హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందగా, అతని కుటుంబ సభ్యులు అతని కళ్లను సదాశయ ఫౌండేషన్‌కు దానం చేశారు. సోమవారం కాగజ్‌నగర్‌కు వచ్చిన ఫౌండేషన్ సభ్యులు మృతుని కుటుంబ సభ్యులకు మెమోంటో అందించారు. ఈ సందర్భంగా అనంత రాములు మాట్లాడుతూ ఇంటి పెద్ద దిక్కు చనిపోయిన దు:ఖంలోనూ కుటుంబ సభ్యులు కళ్లను దానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ రాచకొండ గిరీష్‌కుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



పెన్షన్ ఇప్పిస్తానని బురిడీ..!

● డబ్బులు తీసుకుని పరారైన నిందితుడు

● పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

నవతెలంగాణ-భైంసా



పెన్షన్ ఇప్పిస్తానంటూ బురిడీ కొట్టించి, డబ్బులు కాజేసిన ఘటన సోమవారం ఉదయం భైంసా పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం... కుభీర్ మండలం మాలేగాం గ్రామానికి చెందిన 60 సంవత్సరాల వయసు గల గంగాధర్ భైంసా బస్టాండ్ పక్కన గల ఎస్బీఐ బ్యాంకు నుంచి రూ.30వేలు రూపాయలను విత్‌డ్రా చేసి బయటకు రాగా, ఓ గుర్తు తెలియని వ్యక్తి నెలకు రూ.28వేలు పెన్షన్ ఇప్పిస్తా తాత అంటూ..! పలకరించి, బస్టాండ్ ముందర గల ప్రభుత్వాస్పత్రికి తీసుకొని వచ్చి రూ.19వేలను తీసుకొని, సంబంధిత పత్రంపై సార్ వద్ద నుంచి సంతకం తీసుకొస్తానంటూ అక్కడి నుంచి జంప్ అయ్యాడు. నేను వచ్చేవరకు ఇక్కడే ఉండని వెళ్లిపోయాడు. ఎంతకీ రాకపోవడంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా ప్రస్తుతం పోలీసులు సీసీ కెమెరాలు ద్వారా నిందితున్ని గుర్తించే పనిలో పడ్డారు. నిందితుడు మాస్క్ వేసుకొని ఈ మొత్తం తతంగం నడిపినట్టు తెలిసింది.

కళాశాల మైదానంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని స్థానిక జూనియర్ కళాశాలలో మైదానంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని సోమవారం సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణాధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ కళాశాల మైదన ప్రాంతంలో సరైన లైటింగ్ లేకపోవడం చాలా కాలంగా ఉన్న సమస్యగా ఉందన్నారు. రాత్రి వేళల్లో యువతకు ఆటలకు ప్రభావం చూపుతోందన్నారు. ప్రభుత్వ పరంగా సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయడం వల్ల యువతకు ప్రజలకు వారి అవసరాలను మెరుగుపరచడమే కాకుండా ప్రమాదాలు నేరాలను నివారించవచ్చని అన్నారు. ప్రజలకు యువతకు సురక్షితమైన వాతావరణం ఉండేలా, జూనియర్ కళాశాల మైదానంలో సెంట్రల్ లైటింగ్‌ను వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు మున్సిఫ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని శ్యామ్‌నాయక్ తండాకు చెందిన జాదవ్ బిక్కు సోమవారం పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా మృతుడు విద్యుత్ సంస్థలో హెల్పర్‌గా పనిచేసేవాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్ సొసైటీ బాధిత కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్ సొసైటీ అధ్యక్షుడు పాండు, ప్రధాన కార్యదర్శి గంగన్న మాట్లాడుతూ కార్మికులు ఎవరు కూడా మనో ధైర్యాన్ని కోల్పోవద్దన్నారు. ఆత్మహత్యలు చేసుకోవడం సరికాదన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా తెలంగాణ విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్ సొసైటీ వారు తోడు ఉంటారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్ కాంటాక్ట్ వర్కర్ సొసైటీ ఉపాధ్యక్షులు ఇబ్రహీం, సతీష్, బాపూరావు, ప్రకాష్, జబ్బర్ లాల్, దిగంబర్ ఉన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నిర్మల్ జిల్లా సమితి కన్వీనర్ కైలాస్ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో డీఐఈఓ పరుశురాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు బకాయిలను విడుదల చేస్తామని, విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి ఇప్పుడు ప్రభుత్వం బకాయిలను విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని కైలాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మహేష్, ప్రవీణ్, సన్నీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీఓ వసంతరావు సంబంధిత అధికారులకు తెలిపారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. ఇంద్రవెల్లి మండలం వాడ్‌గాం గ్రామానికి చెందిన విజయలక్ష్మి తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో ఏపీఓ మెస్రం మనోహర్, పీహెచ్ఓ సందీప్ కుమార్, పేసా కోఆర్డినేటర్ వసంతరావు, డీపీఓ ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రోజులు సోయా కొనుగోళ్ల నిలిపివేత

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో స్థానిక మార్కెట్ యార్డులో ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపడుతున్న సోయా కొనుగోలు కేంద్రాలు ఈనెల 26, 27న రెండు రోజులు నిలిపివేస్తున్నట్టు సొసైటీ సీఈఓ గొలి స్వామీ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే తిరిగి ఈ నెల 28న గురువారం నుంచి యదావిధిగా కొనుగోళ్లు చేపడుతామని అన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి, సహకరించాలని కోరారు.

ప్రజావాణి దరఖాస్తులను రిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని జూమ్ విధానం ద్వారా ఆదేశించారు.

నేటి నుంచి దివ్యాంగులకు పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు మహిళ, శిశు దివ్యాంగుల, వయోవృద్దుల శాఖ, డీడబ్ల్యూఓ భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10 నుంచి 16 సంవత్సరాలలోపు వయస్సు వరకు అందులకు పరుగు పందెం, షార్ట్‌పుట్, జావెలిన్‌త్రో, శారీరక దివ్యాంగులకు మూడు చక్రల సైకిల్ పరుగు పందెం, త్రో, చెస్, షాట్‌పుట్, పరుగు పందెం, క్యారం, బదిరులకు పరుగు పందెం, షార్ట్‌పుట్, చెస్, క్యారం, మానసిక వికలాంగులకు పరుగు పందెం, షార్ట్‌పుట్, చెస్, క్యారం పోటీలుంటాయన్నారు. అదే విధంగా 17 నుంచి 54 సంవత్సరాలలోపు వయస్సు వారికి కూడా పోటీలుంటాయన్నారు. ఆటల పోటీలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.